వెలిగిన వీధి దీపాలు..



కల్పతరురోడ్డులో వెలుగుతున్న వీధిలైట్లు

సాక్షి ఎఫెక్ట్..

సత్తుపల్లిటౌన్: ఎట్టకేలకు పట్టణంలోని కల్పతరురోడ్‌లోని అంతర్గత వీధుల్లో వీధి దీపాలు వెలిగాయి. 'మూన్నాళ్ల ముచ్చటేనా' శీర్షికన ఈ నెల 25న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సోలార్ లైట్లు మరమ్మతులకు గురికావటంతో చాలా రోజులుగా ఆయా వీధుల్లో అంధకారంలో ఉండటంతో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ స్పందించి వెంటనే మున్సిపల్ లైట్లు అమర్చి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టారు.

సాగుకు సన్నద్ధం..

ఖరీఫ్ సీజన్‌కు దుక్కులు దున్నుతున్న రైతులు

- అయినా ఊసేలేని పంట రుణాలు
- విత్తనాలు, ఎరువులపై ఆందోళన
- కష్టాలు తీర్చాలని అన్నదాతల వేడుకోలు



చింతకానిలో దుక్కి దున్నుతున్న రైతు

చింతకాని: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలకు అనుకూల పరిస్థితులు ఉన్నట్టు వాతావరణ నిపుణులు చెబుతుండటంతో కోటి ఆశలతో రైతులు వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. ముందస్తుగా వర్షాలు కురుస్తుండటంతో పంటల దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు.

గతేడాది నష్టాల మయం..

గతేడాది రైతులు పత్తి పంటను అధికంగా సాగు చేయగా వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల ఉధృతితో పత్తి పంట దిగుబడులు పూర్తిగా తగ్గి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. యాసంగిలో సాగుచేసిన మొక్కజొన్న పంటకు నీళ్ల సౌకర్యం లేక ఆశించిన దిగుబడులు రాలేదు. పెసర పంట సాగు అనుకూలంగా ఉన్నప్పటికీ మద్దతు ధర లేకపోవటంతో పంటపై కూడా రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. గతేడాది పంటల సాగులో వచ్చిన నష్టాలను అధికమించి రైతులు వానాకాలం పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు.

ఊసేలేని పంట రుణాలు..

రైతుల పంట రుణాలు మాఫీ కాకపోవటంతో వానాకాలం సీజన్‌కు సంబంధించి రుణాల ఊసే లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్‌కు పంట రుణాలు తక్షణమే అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పంట రుణాలను కూడా అందించి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండాలని రైతులు వేడుకుంటున్నారు.

విత్తనాలు, ఎరువులతో ఆందోళన..

కాంప్లెక్స్ ఎరువుల ధరలను కంపెనీలు ప్రతీ ఏడాది పెంచుతూ ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఏడాది ఎరువుల ధరలు ఏ విధంగా ఉంటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ ఏడాది పెరుగుతున్న ఎరువుల ధరలతో పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగి పంటల సాగు అంటేనే భయపడే పరిస్థితి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉన్న సొసైటీల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలతో పాటుగా ఎరువులను కూడా అందుబాటులో ఉంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముందస్తు దుక్కులతో ప్రయోజనం



ముందస్తుగా దుక్కులను దున్నుకోవటంతో భూమిలో ప్యూపా దశలో ఉన్న పురుగులు చనిపోతాయి. వానాకాలం పంటలకు ఆశించే కీటకాల ఉధృతిని తగ్గించుకోవచ్చు. సాగుచేసే పంటలకు అనుగుణంగా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– పల్లెల నాగయ్య,
మండల వ్యవసాయాధికారి, చింతకాని

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలి..



అధికారులు వానాకాలం సీజన్‌లో సాగుచేసే పంటలకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలి. వరి, పెసర, మినుము వంటి విత్తనాలతో పాటుగా పత్తి విత్తనాలను కూడా సొసైటీల ద్వారా రైతులకు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. వానాకాలం సాగుకు పంట రుణాలను సకాలంలో అందించి ఆదుకోవాలి.

– ఎరుకలబోయిన శ్రీను, రైతు,
మత్కేపల్లి, చింతకాని మండలం

మండలంలో సాగు వివరాలు..

మండలంలోని రైతులు ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, వరి, మిరప, పెసర పంటలను సాగు చేస్తారు. గతేడాది వానాకాలం సీజన్‌లో పత్తి 19 వేల ఎకరాల్లో, మొక్కజొన్న 470, వరి 4,550, పెసర 3,697, మిరప 1,370 ఎకరాల్లో రైతులు పంటలను సాగుచేశారు. ఈ వానాకాలం సీజన్‌లో మొక్కజొన్నకు బదులుగా పత్తి, పెసర పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో మండలంలో పత్తి, పెసర పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. కంది పంటను సాగుచేస్తే యాసంగిలో మొక్కజొన్నకు అనుకూలంగా ఉండదని రైతులు కంది సాగుకు అంతగా మక్కువ చూపడం లేదు. మండలంలో పత్తి, పెసర పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగానే విత్తనాలను అందుబాటులోకి తెచ్చే విధంగా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుని సాగు కష్టాలను తీర్చాలని రైతులు కోరుతున్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ కరుణశ్రీ

వైరా: వైరా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల రైతులకు ఆయా గ్రామాల వారీగా పంపిణీ చేయనున్నట్టు ఏఓ పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం వైరా ఏడీఏ కరుణశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ కరుణశ్రీ,, ఏఓ పవన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల వారీగా ఏఈఓలు, సొసైటీ సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. ఏఈఓలు సీడ్ పోర్టల్‌తో ఆన్‌లైన్ బిల్లు జనరేట్ చేసి రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఇందుకోసం రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ బిల్లు విత్తనాల నగదు సొసైటీ కార్యాలయంలో చెల్లించి విత్తనాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ రామకృష్ణ, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్లు

బోనకల్: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మధిర ఏడీఏ కొంగర వెంకటేశ్వరావు అన్నారు. మండలంలోని రావినూతల గ్రామంలో విత్తన దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, విత్తనాల స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు ఈ ఏడాది పత్తి సాగు ముందస్తు అంచనా 17,718 ఎకరాలు ఉంటుందన్నారు. విత్తన దుకాణాలలో పత్తి విత్తనాలకు సంబంధించి 8,160ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని దుకాణాలలో 20 రకాల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఒకే రకమైన పత్తి విత్తనాల కోసం ఆరాటపడొద్దని, విత్తనాలు విత్తే ముందు నేలలో తగిన తేమ శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సరిత, ఏఈఓలు ఉన్నారు.

కలుషిత నీటి సరఫరా



సరఫరా అయిన రంగు మారిన నీరు

సత్తుపల్లిటౌన్: కలుషితమైన నీటి సరఫరాతో సత్తుపల్లిలోని గాంధీనగర్ వాసులు అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా బురదగా ఉన్న నీరు సరఫరా అవుతోందని చెబుతున్నారు. ఈ నీళ్లు తాగటానికి పనికి రాకపోగా ఇతర అవసరాలకు కూడా వాడే పరిస్థితి లేదని ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి స్వచ్ఛమైన నీరు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయాల్లో అన్నదానం



భోజనం వడ్డిస్తున్న దాతలు

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని అయ్యగారిపేట భక్తాంజనేయస్వామి ఆలయం, వేంసూరురోడ్ మెట్టాంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్ల సాంబశివరావు, రమాదేవి, శ్రీచరణ్, ప్రత్యూష దంపతులు, గంగిశెట్టి జగదీష్‌కుమార్ భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో బొంతు మాధవరావు, నాగళ్ల ప్రసాద్, పురుషోత్తం, మల్లూరు అంకమరాజు, కాలిలేని కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

'దోస్త్' మొదటి దశకు నేడు ముగియనున్న గడువు

సత్తుపల్లిటౌన్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి దోస్త్ మొదటి దశ రిజిస్ట్రేషన్లకు బుధవారంతో గడువు ముగుస్తుందని సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్, దోస్తు కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కళాశాలకు నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

తల్లాడ: కిశోర బాలికలు, యువతులు రుతుస్రావం సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి రత్న మనోహర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యులు ఆరోగ్య పర్యవేక్షకులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ



తండ్రికి దహన సంస్కారాలు నిర్వహిస్తున్న పుల్లమ్మ

మధిరరూరల్: తండ్రికి కుమార్తె అంత్యక్రియలు నిర్వహించిన ఘటన మాటూరుపేట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముదిగొండ మల్లేశ్వరరావు (60) సోమవారం రాత్రి మృతి చెందగా ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె సిద్దినేనిగూడెం గ్రామానికి చెందిన సాగి పుల్లమ్మ తన తండ్రికి దహన సంస్కారాలు నిర్వహించింది.

పల్లెప్రకృతి వనం ధ్వంసం



పల్లెప్రకృతి వనంలో రహదారికి ఇరువైపులా ధ్వంసం చేసి కుప్పగా పోసిన ఇటుకలు

పెనుబల్లి : పెనుబల్లిలోని పల్లెప్రకృతి వనాన్ని కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. ప్రకృతివనంలోని రేకుల షెడ్‌ను, మోటారును, సిమెంట్ బెంచీలను, వాటర్ పైపులను ఎత్తుకెళ్లారు. ప్రకృతివనంలో రహదారికి ఇరువైపులా అందంగా అలంకరించిన మట్టి ఇటుకలను పీకేసి ధ్వంసం చేశారు. ఇది గమనించిన స్థానికులు మంగళవారం ఎంపీడీఓకు, గ్రామ ప్రత్యేకాధికారికి, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ఎస్‌వి ప్రసాద్‌రావు ఉపాధిహామీ ఏపీఓ, జేఈలతో కలిసి పల్లె ప్రకృతివనాన్ని సందర్శించి అక్కడపోయిన వస్తువులను ఫిర్యాదులో పేర్కొని వియంబంజర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పల్లెప్రకృతి వనంలో మాయమైన వస్తువులను దొంగిలించిన వారిని గుర్తించి, ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఎస్‌వి ప్రసాద్‌రావు ఫిర్యాదులో తెలిపారు. దీనిని పరిశీలించి దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

ఎన్టీ రామారావుకు ఘన నివాళి



మధిర: అన్నదానం చేస్తున్న హనుమంతరావు తదితరులు

మధిర: కళా నైపుణ్యంతో ప్రజలను మెప్పించిన నటుడు ఎన్టీఆర్ యుగ పురుషుడని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అన్నారు. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ జయంతి వేడుకలను మంగళవారం మధిరలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల సేవాసదనంలో అన్నదానం చేశారు. అనంతరం పట్టణంలోని పలు చోట్ల ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు, చేకూరి శేఖర్ బాబు, గద్దం రమేష్, మేడా వెంకటేశ్వరరావు, పాశం రామనాథం తదితరులు పాల్గొన్నారు.

వైరా: ఎన్టీఆర్ జయంతి వేడుకల సందర్భంగా వైరా టీడీపీ కార్యాలయంలో పలువురు నాయకులు ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పార్టీ టీడీపీ జెండా ఆవిష్కరించారు.

ఎన్టీఆర్ ఘాట్ వద్ద సండ్ర నివాళి

సత్తుపల్లి: ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హైద్రాబాద్ ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. తెలుగుజాతికే కీర్తి శిఖరం, ప్రజాసేవలో తరించారని కొనియాడారు.

చింతకాని: మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏన్కూరు: మండలకేంద్రంలో కమ్మయువజన సంఘం, ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎంపీపీ అరెం వరలక్ష్మీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ కోపెల శ్యామల, అరెం రామయ్య, మేడ ధర్మారావు,జనార్ధన్, కొనకంచి రామకృష్ణ, వేముల రమేష్, రాధాకృష్ణ, రామారావు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం, రేమిడిచర్ల, ఎర్రుపాలెం, వెంకటాపురం తదితర గ్రామాల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. టీడీపీ మండలాధ్యక్షుడు దోమందుల సామేలు, నాయకులు షేక్ మౌలానా, మొగిలి రాజేష్, గురిజాల సత్యనారాయణ, షేక్ లాలు, దేవరకొండ మోహన్‌రావు, నాగిరెడ్డి వెంకయ్య, మస్తాన్, రామారావు, వీరబాబు, వెంకటయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకటనర్సయ్య, వాసిరెడ్డి శివకుమారి, ప్రవల్లిక, నాగిరెడ్డి, తదితరులున్నారు

బోనకల్: మండల కేంద్రంలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సత్యనారాయణ, కొండలరావు, బందం అనిల్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలో టీడీపీ మండలాధ్యక్షుడు కూచిపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఎన్టీర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. సరికొండ శ్రీనివాసరాజు, కొమ్మినేని రాము, రావూరి రవిప్రసాద్, దుగ్గిన్ని వెంకటేశ్వర్లు, గొడ్ల వెంకటరత్నం, బొడ్డు రామలక్ష్మణ్, కొమ్మినేని నరసింహారావు, నున్నా రామారావు, నారపోగు ప్రసాద్, మోక్కా కృష్ణార్జున్, కందుల నారాయణ, దాసరి ప్రసాద్, మల్లారెడ్డి, రాంబాబు, శీలం నర్సిరెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



వైరా: నివాళులర్పిస్తున్న నాయకులు



సత్తుపల్లి: ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

నేటి నుంచి జీలుగు విత్తనాలు పంపిణీ

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు, తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం, రాజుపాలెం, ములుగుమాడు, అయ్యవారిగూడెం, పెద్ద గోపవరం సొసైటీల్లో ఈ నెల 29 నుంచి ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు సబ్సిడీ ధరపై రైతులకు జీలుగు విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.విజయభాస్కరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కేజీల బ్యాగు రూ.1,116 పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. రైతుల తమ పొలం పాస్ పుస్తకాల, ఆధార్ కార్డు జీరాక్స్‌లను తీసుకొని రైతువేదికల్లోని స్థానిక ఏఈవోలను సంప్రదించి వారి నుండి టోకెన్ తీసుకుని సొసైటీ కార్యాలయాల్లో విత్తనాలు పొందాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొణిజర్ల: కొణిజర్ల మండలంలో మంగళవారం నుంచి పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏఓ డి.బాలాజీ తెలిపారు. 60 శాతం రాయితీ పై రైతులకు జీలుగలు, జనుములు పంపిణీ చేయనున్నట్లు మంగళవానం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగలు 30 కేజీల బస్తా రూ 1,116,జనుములు 40 కేజీల బస్తా రూ.1,448 చొప్పున అమ్మకం చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ పరిధిలోని ఏఈఓ ల వద్ద పట్టాదారు పాస్ పుస్తకం ఆధార్ కార్డు జీరాక్స్‌లు ఇచ్చి ఆన్‌లైన్ రశీదు పొందాలన్నారు. అట్టి రసీదు కొణిజర్ల సొసైటీ కార్యాలయంలో అందజేసి పచ్చి రొట్ట విత్తనాలు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

- నేటి నుంచి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు
- మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ



కల్యాణానికి ముస్తాబైన శ్రీ లక్షీనరసింహస్వామి దేవాలయం

కారేపల్లి: మండలంలోని తొడితలగూడెం గ్రామ శివారులో వేంచేసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. బుధవారం నుంచి జూన్ 1 వరకు మూడు రోజుల పాటు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ బ్రహోత్సవాలు నిర్వహించనున్నారు. 132 ఏళ్ల అతిప్రాచీన మహిమాన్వితమైన దేవాలయంలో ప్రతీ ఏటా సంప్రదాయబద్ధంగా వైశాఖ మాస బహుళ సప్తమిన కల్యాణ వేడుకలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యాన అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టూ పక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. నరసింహస్వామి దేవాలయంతో పాటుగా పంచ విగ్రహ ఆంజనేయస్వామి, లక్ష్మీ గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, జిన్నాద్ బాబా దేవాలయాలున్నాయి.

మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు..

ఈ మేరకు బుధవారం పంచమృతాభిషేకాలు, కల్యాణ మంగళస్నానం, కల్యాణ తిలకోద్ధరణ, ధ్వజారోహణం, నక్షత్ర ఆరాధన హారతి, 30న సుప్రభాత సేవ, స్వామి వారి అలంకరణ, గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండ జ్యోతి ప్రజ్వలనం, స్వామి కల్యాణ స్నానం, లక్ష్మీ అమ్మ వారి గ్రామోత్సవం, అంకురార్పణం, స్వామి కల్యాణం, మహా నైవేద్యం, మహా అన్నదానం, ఉయ్యాల సేవ, జూన్ 1న శ్రీ హనుమాన్ జయంతి మహోత్సవ పూజా కార్యక్రమంలో భాగంగా 41 పారాయణం హనుమాన్ చాలీసా, అన్న సంతర్పణ ప్రసాద వితరణతో పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణ బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కమిటీ సభ్యులు కోరారు.

పునీత అన్నమ్మ దేవాలయం ప్రారంభం



ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతులు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో నిర్మించిన పునీత అన్నమ్మ దేవాలయాన్ని మంగళవారం హైద్రాబాద్‌కు చెందిన అగ్ర పీఠాధిపతి కార్డినల్ పూల ఆంథోనితో పాటు పలువురు పీఠాధిపతులు ప్రారంభించారు. శాంతికి నిదర్శనంగా పావురాలను గాలిలోకి ఎగురవేశారు. పునీత అన్నమ్మవారి ప్రతిమ విగ్రహాన్ని ఆవిష్కరించారు. సంఘస్తులతో కలిసి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. పీఠాధిపతులు భక్తులకు సందేశమిచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు సూరేపల్లి ఐజాక్, చర్చి ఫాదర్లు , సంఘస్తులు పాల్గొన్నారు.

ఆలయం పక్కనే బెల్ట్‌షాపులు..!

- వివాద స్థలంలో యథేచ్ఛగా దుకాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



సింగరాయపాలెంలో దేవాలయం ఎదురుగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులు

కొణిజర్ల: ఓ పక్క రామాలయం, మరో పక్క కోర్టు వివాదంలో ఉన్న చెరువు శిఖం భూమి అయినా కొంత మంది గ్రామస్తులు యథేచ్ఛగా సదరు స్థలంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ దేవాలయానికి వచ్చే భక్తులను భయాందోళనలకు గురి చేస్తున్నారు. మండలంలోని సింగరాయపాలెం గ్రామంలో ఊరు ముందు ఉన్న చెరువు తనదే తమ పూర్వీకుల పట్టా అని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కోర్టుకు పోవడంతో 40 ఏళ్లుగా గ్రామస్తులకు సదరు వ్యక్తికి మధ్య కోర్టులో వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో కొన్నేళ్ల క్రితం గ్రామస్తులు చెరువుకు సమీపంలోనే రామాలయాన్ని నిర్మించారు. ఈ క్రమంలో ఇటీవల గ్రామానికి చెందిన కొందరు మహిళలు రామాలయానికి ఎదురుగానే చెరువు శిఖం భూమిలో బడ్డీ కొట్లు ఏర్పాటు చేసి బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. దీంతో సాయంత్రం అయితే పోకిరీలంతా ఆ దుకాణాల వద్దే చేరి రామాలయం ఎదురుగానే మద్యం సేవిస్తున్నారు. దేవాలయానికి వచ్చే మహిళలు సదరు యువకులను చూసి భయాందోళనలకు గురై ఆలయానికి రావడం కూడా మానివేశారు. ఇటీవలే ఇద్దరు యువకులు తాగిన మైకంలో బీరు సీసాలతో తలలు పగలగొట్టుకుని పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా పెట్టుకున్న ఘటన ఉంది. పోలీసులు కేసు నమోదు చేయగా గ్రామ పెద్దలు సర్ది చెప్పి కేసు మాఫీ చేయించినట్లు సమాచారం. ఇంతా జరుగుతున్నా అటు ఎక్సైజ్ అధికారులుకానీ, ఇటు రెవెన్యూ అధికారులు గానీ సదరు దుకాణాదారులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దేవాలయం వద్ద బెల్టు షాపులు తీసి వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.